పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 5 సంచిక: 10 అక్టోబర్ 2017 వెల: 20/-

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

మీ సలహాలు, సందేహాలు,
ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

paighamehidayath.tk

విషయ సూచిక:

ఖుర్ఆన్ సందేశం:
సూర ఎ నూర్ 5
హదీస్ సందేశం:
మృదుభాష్యం–దుర్భాష 7
వనితావని:
ఫజర్‌లో మెలుకువ రావడానికి కొన్ని చిట్కాలు... 10
ప్రత్యేక వ్యాసాలు
సఫర్ ఇస్లాం దృష్టిలో 13
ప్రవక్త (స) వారి ప్రార్ధనలు 18
సందేహాలు - సమాధానాలు
సూట్ ధరించవచ్చా....? 26

ఫెహ్‌రిస్తే మజామీన్:

దర్సే ఖుర్ఆన్:
సూర ఎ నూర్ 29
దర్సే హదీస్:
ఖుష్ కలామీ ఔర్ బద్‌జుబానీ 31
ఖుసూసీ మజామీన్
సఫర్ ఇస్లామ్ కీ నజర్ మే 34
ఇస్లామ్ కే ఆదిలానా ఇజ్దెవాజీ నిజామ్ సే హుకూమతో సహాఫత్ కీ నాఇన్‌సాఫీ 39
సువాలో జవాబ్
క్యా సూట్ పెహెన్ సక్తే హైం 49

చరితార్థులు:
షేఖ్ భికారీ సాహెబ్ 28

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

ఖుర్ఆన్ సందేశం

సూరే హుజ్‌రాత్

بسم الله الرحمن الرحيم

లౌలా ఇజ్ సమిఅ్తుమూహు జన్నల్ ముఅ్మినూన వల్ ముఅ్మినాతు బిఅన్ఫుసిహిమ్ ఖైరా వ కాలూ హాజా ఇఫ్కుమ్ ముబీన్

లౌలా జాఊ అలైహి బిఅర్బఅతి షుహదాఅ ఫ ఇజ్ లమ్ తఅ్తూ బిష్షుహదాఇ ఫఉలాఇక ఇన్దల్లాహి హుముల్ కాజిబూన్

దాన్ని గురించి వినగానే విశ్వాసులైన స్త్రీ పురుషులు తమ వారిపట్ల మంచి తలంపుతో, "ఇది పచ్చి అభాండం" అని ఎందుకనలేదు?

దీనిపై వారు నలుగురు సాక్షుల్ని ఎందుకు తీసుకురాలేదు? సాక్షుల్ని తీసుకురానందున ఈ నీలాపనిందను మోపిన వారు అల్లాహ్ సన్నిధిలో అబద్ధాల కోరులయ్యారు.

క్రిందటి సంచికలో కపటుల నాయకుడైన అబ్దుల్లాహ్ బిన్ ఉబై, విశ్వాసుల మాతృమూర్తి అయిన హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారిపై ఏ విధంగా అభాండాలు మోపే దుస్సాహసం చేశాడో మనం చూశాము. అతడి ఈ నీచ కార్యాన్ని బయలుపరుస్తూ, స్వయంగా అల్లాహ్ తఆలా హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారి పాతివ్రత్యానికి సాక్షమిస్తూ అవతరింపజేసిన వచనాలను మనం చదివాము.

ఈ సంఘటన చోటుచేసుకున్నప్పుడు విశ్వాసులు మూడు వర్గాలుగా అయిపోయారు. కొందరు ఈ దుర్మార్గుడి అభాండాన్ని విన్నవెంటనే క్షణం పాటు ఆలస్యము కూడా చేయకుండా దాన్ని తిరస్కరించేశారు. మరికొందరు నిజాలు దేవుడే ఎరుగు, మేమైతే ఈ విషయంలో ఏమీ చెప్పము. అవును అని అనము, కాదు అనీ అనము అంటూ అలా ఉండిపోయారు. ఇక మూడవ వారు (వీరు మొత్తం నలుగురు) వీరు విశ్వాసులే అయినప్పటికీ నిజానిజాలు తెలియకుండానే ఆనోటా ఈ నోటా విన్న ప్రతీ మాటనూ అన్ని చెవులా చేరవేస్తూ తిరిగారు. చివరికి ఈ వదంతాలను వ్యాపింపజేసిన నేరాన ఆ నలుగురు శిక్షను అనుభవించారు.

ఇక నేటి సంచికలో ప్రస్తావించబడిన ఈ వచనాలలో అల్లాహ్ తఆలా మూడు వర్గాలుగా చీలిపోయిన

విశ్వాసులను సంభోదిస్తూ, ఇలాంటి పరిస్థితులు చోటుచేసుకున్నప్పుడు ఎలా స్పందించాలి? ఒక విశ్వాసి ఆ సందర్భంలో ఏమి చేయాలి? అనే విషయాన్ని బోధించారు.

"ఇది పచ్చి అభాండం" అని ఎందుకనలేదు?

ముస్లింలు అందరూ ఒకే శరీరం, ఒకే ప్రాణం లాంటి వారు. ఒకే మార్గంపై నడవవలసిన వారు. ఒకే ధర్మాన్ని అవలంభించేవారు. అటువంటి శ్రేష్ఠ సమాజ సభ్యులు ఏం చేయాల్సింది? ఇలాంటి వదంతులు పుట్టినప్పుడు తక్షణం ఖండించాల్సిందిపోయి మూడు వర్గాలుగా చీలిపోయారు. అది పచ్చి అభాండం అని చెప్పాల్సిందిపోయి కొందరు "మేము అటూ మాట్లాడము, ఇటూ మాట్లాడమూ" అంటూ, మరికొందరు వాటిని వ్యాపించుకుంటూ తిరిగారు.

ఎప్పటివరకైతే సరియైన ఆధారాలతో రుజువు కాదో అప్పటి వరకు ఒక విశ్వాసి గురించి ఎలాంటి విషయాలు విన్నా అతడి గురించి రవ్వంత అనుమానము కూడా హృదయాలలోకి చేరనివ్వరాదు. ఇక్కడ ఒక్క సాక్షముగానీ, ఎలాంటి ఆధారము గానీ లేదు. అలాంటప్పుడు దాన్ని అందరూ ఖండించాల్సింది పోయి అభిప్రాయభేదాలకు గురి అయ్యారు. కాబట్టి అల్లాహ్ తఆలా విశ్వాసుల తీరును ఖండిస్తూ వారిని మందలిస్తూ, వారిని సంస్కరిస్తూ, ఇలాంటి విషయాలు చోటు చేసుకుంటే ఒక విశ్వాసి తీరు ఎలా ఉండాలో తెలియపరుస్తూ ముందు వచనములో ఇలా అంటున్నారు.

వలౌలా ఫజ్‌లుల్లాహి అలైకుమ్ వరహ్మతుహూ ఫిద్దునియా వల్ ఆఖిరతి లమస్సకుమ్ ఫీమా అఫజ్‌తుమ్ ఫీహి అజాబున్ అజీమ్

ఇహపరలోకాలలో మీ పై అల్లాహ్ అనుగ్రహం, ఆయన దయ గనక ఉండకపోతే ఏ మాటల్లోనయితే మీరు పడిపోయారో, దానికి పర్యవసానంగా, ఓ పెద్ద శిక్ష మిమ్మల్ని చుట్టుకునేది.

ఇజ్ తలక్కౌనహూ బిఅల్‌సినతికుమ్ వతకూలూన బిఅఫ్‌వాహికుమ్ మాలైస లకుమ్ బిహీ ఇల్మున్ వ తహ్‌సబూనహూ హయ్యినన్ వహువ ఇన్‌దల్లాహి అజీమ్

(ఎందుకంటే) అప్పుడు మీరు ఆ విషయాన్ని ఆ నోటా ఈ నోటా అందుకుని (వ్యాపింపజేశారు) మీకు ఏమాత్రం తెలియని విషయాన్ని మీ నోటితో పేలటం మొదలెట్టారు. మీరు దాన్ని చిన్న విషయంగా భావించారు. కాని అల్లాహ్ దృష్టిలో మాత్రం అది చాలా పెద్ద విషయం.

వలౌలా ఇజ్ సమిఅ్‌తుమూహు కుల్తుమ్ మాయకూను లనా అన్ నతకల్లమ బిహాజా సుబ్‌హానక హాజా బుహ్‌తానున్ అజీమ్

అసలు మీరు ఆ మాట వినగానే, "ఇలాంటి మాట చెప్పడం మనకు ఎంత మాత్రం తగదు. ఓ అల్లాహ్ ! నీవు పరమ పవిత్రుడవు. ఇది మాత్రం పెద్ద అభాండమే" అని ఎందుకు అనలేదు?

యఇజుకుముల్లాహు అన్ తూదూ లిమిస్లిహీ అబదన్ ఇన్ కున్‌తుమ్ ముఃమినీన్

మీరు నిజమైన విశ్వాసులే అయితే ఇక మీదట ఎన్నడూ ఇలాంటి చేష్టకు పాల్పడరాదని అల్లాహ్ మీకు బోధపరుస్తున్నాడు.

(ఈ వచనాల సారాంశాన్ని, ఇందులో ఇవ్వబడిన ఆదేశాల వివరాలని మనం ఇన్‌షాఅల్లాహ్ వచ్చే సంచికలో సంక్షిప్తంగా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం).

మృదుభాష్యం-దుర్భాష

మానవుడు తన నిత్య జీవితంలో తనలాంటి వారెందరితోనో కలుస్తూ ఉంటాడు. ఈ క్రమంలో ఒకరి నుండి ఒకరు గ్రహించే ప్రభావంలో సంభాషణ అతి ముఖ్యమైనది. తియ్యని సంభాషణ, కటువైన సంభాషణ, మృదుభాషణ, కఠిన పదజాల ప్రయోగం ఏదైనా కావచ్చు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ తన అనుచరగణానికి, నగుమోముతో తియ్యగా మాట్లాడాలని ఉద్బోధించారు. చిటపటలాడుతూ కఠినంగా, కరకుగా మాట్లాడకూడదని గట్టిగా వారించారు. చివరికి చెడుమాటకు ప్రతిగానైనా సరే, చెడు మాటతో సమాధానం పలకడాన్ని కూడా ఆయన ఎంతమాత్రం ఇష్టపడేవారు కాదు. ఈ విషయాలకు సంబంధించిన కొన్ని హదీసులు క్రింద పేర్కొంటున్నాము.

★ **హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖించారు: "కొంత మంది యూదులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సన్నిధిలో హాజరై, (చాలా పొగరుగా, తలబిరుసుతనంతో అస్సలాము అలైకుమ్ కు బదులుగా) 'అస్సాము అలైకుం అన్నారు. (అంటే ఇదొక తిట్టు, నీకు చావు మూడుగాక అని దీనర్థం). అప్పుడు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా "మీకే మూడుగాక, మీపై అల్లాహ్ శాపం, ఆగ్రహం అవతరించుగాక!" అన్నారు.**

ఇది విని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు, "ఆయిషా ! (అంత కఠినంగా మాట్లాడకు) నోటిని అదుపులో ఉంచుకో. మెతక వైఖరిని అవలంబించు. కాఠిన్యం, దుర్భాషనుండి నిన్ను నువ్వు రక్షించుకో" అని సెలవిచ్చారు.

(బుఖారీ)

సంగ్రహణం:

చూడండి దైవ ప్రవక్త మహనీయులు తన పట్ల అంత అమర్యాదగా మాట్లాడిన వారికి వ్యతిరేకంగా కూడా కాస్తంత కఠినంగా మాట్లాడినా హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా ను వారించారు. మెతక వైఖరిని, మృదుభాష్యాన్ని అవలంభించమని ఉపదేశించారు.

★ **హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్ఊద్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారు:**

"విశ్వాసి అయిన దాసుడు నోటితో దాడికి దిగడు. శాపాలు పెట్టేవాడూ అయి ఉండడు. దుర్భాషలాడేవాడు, అశ్లీలం పలికేవాడు కాడు".

(తిర్మిజీ)

సంగ్రహణం:

నోరు విప్పితే దుర్భాషలాడడం, అశ్లీలం పలకడం, శాపనార్థాలు పెట్టడం అనేవి దైవ

విశ్వాసికి శోభించని లక్షణాలు. ఇలాంటి చేష్టలు అతని స్థాయిని దిగజార్చుతాయి. కితాబుల్ ఈమాన్ లో విభేదాలు తలెత్తినప్పుడు బూతులు తిట్టడం కపటగుణంగా చెప్పబడింది.

★ హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా ఇలా ఉల్లేఖించారు:

"ఒక వ్యక్తి దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారిని కలుసుకోవడానికి అనుమతి కోరాడు. అప్పుడు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు (ముస్లిమ్ని ఉద్దేశిస్తూ) "ఇతను చాలా చెడ్డవాడు" అని చెబుతూనే లోపలికి వచ్చే అనుమతి ఇవ్వండి అని అన్నారు.

(బుఖారీ; ముస్లిం; అబూదావూద్)

అతడు వచ్చిన తరువాత దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అతనితో ఎంతో మృదువుగా మాట్లాడారు. (అతను వెళ్ళిన తరువాత) హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారితో ఇలా విన్నవించుకున్నారు:

"దైవప్రవక్తా ! మీరా వ్యక్తితో ఎంతో చక్కగా, మృదువుగా మాట్లాడారు. ముందేమో అతణ్ని గురించి వేరుగా చెప్పారు (అతడు తన తెగలో చాలా చెడ్డవాడని)

అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "ప్రళయదినం నాడు హెూదాపరంగా అల్లాహ్ దగ్గర అత్యంత చెడ్డవాడు ఎవరంటే, ఎవరి నోటి దురుసుతనం, కాఠిన్య సంభాషణ కారణంగా ప్రజలు అతనికి దూరంగా ఉంటారో ఆ వ్యక్తే. (ప్రజలు అతణ్ని కలుసుకోవడానికి, మాట్లాడడానికి ముందుకు రారు) అని సెలవిచ్చారు.

సంగ్రహణం:

అంటే ఒకవేళ అవతలివాడు దుష్టుడు, దుర్మార్గుడు అయినప్పటికి, అతనితో మృదువుగా, హుందాగా, మంచిగా మాట్లాడాలన్నది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రవచన సారాంశం. అలాకాక కఠిన వైఖరి అవలంభించినట్లయితే ప్రజలెవరూ అతణ్ణి కలుసుకోవడానికి ముందుకు రారు. ఈ కారణంగా అతడు అల్లాహ్ దృష్టిలో చెడ్డవాడిగా పరిగణించ బడతాడు. ప్రళయదినం నాడు అతని పరిస్థితి చాలా దుర్భరమైపోతుంది.

ఈ హదీసు గురించి మరికొన్ని విషయాలు కూడా తెలుసుకోవాలి:

1. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆ వ్యక్తి తన వద్దకు రాకముందే అతను మంచివాడు కాదని తన వారికి చెప్పారు. ఇలా ఎందుకు చెప్పి ఉంటారు? బహుశా వీరు ఆ దుందుడుకు స్వభావి ముందు జాగ్రత్తగా మసలుకుంటారని, ఆచితూచి మాట్లాడాలనే ఉద్దేశం కావచ్చు. అతడు చెడ్డవాడని తెలియక, అతని ముందు మాట్లాడకూడని మాట ఏమైనా మాట్లాడితే వ్యవహారం బెడిసికొట్టవచ్చు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అతణ్ని గురించి ముందే చెప్పి ఉంటారు.

అంతే కాకుండా ఒక వ్యూహం ప్రకారం ఒకరి చెడు గురించి ఇతరులను జాగృత పరచడం చాడీల కిందికి కూడా రాదు. ఒక హదీసులో ఈ విషయమై ఇలా ఆదేశించబడింది:

"దుష్టులు, దుర్మార్గుల దౌష్ట్యాన్ని గురించి ప్రజలకు చెప్పండి. ఎందుకంటే ఆ దైవదాసులు వారి దౌష్ట్యాల నుండి సురక్షితంగా ఉండగలుగుతారు". (కంజుల్ ఉమ్మాల్)

2. ఈ హదీసు ద్వారా తెలిసిన మరో విషయం ఏమిటంటే, ఒక మనిషి చాలా చెడ్డవాడని, పొగరుబోతని తెలిసినప్పటికీ, అతనితో మృదువైఖరి అవలంభించే సంభాషించాలి. అంతేకాదు ఇదే

విషయానికి సంబంధించి బుఖారీ హదీసులోని ఒక ఉల్లేఖనంలో పదాల భావం ప్రకారం: "దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఆ వ్యక్తిని ఎంతో సంతోషంగా, చిరునవ్వుతో కలుసుకొని సంభాషించారు".

అంటే, ఎవరి చెడును గురించైనా మనకు ముందే తెలిసిపోతే, ఇక వారు మంచివారు కాదు కాబట్టి వారిని కలుసుకోవడం, సంభాషించడం మంచిది కాదు, వారిని దూరంగానే ఉంచాలి అని కొంతమంది భావిస్తారు. కాని ఈ హదీసు వెలుగులో ఈ అభిప్రాయం సరైంది కాదు, సమంజసమూ కాదు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి ప్రసిద్ధ సహచరులు అబూదర్దా రజియల్లాహు అన్హు ద్వారా స్వయంగా ఇమాం బుఖారీ రహ్మతుల్లాహి అలైహ్ గారు ఉల్లేఖించారు:

"ఎవరి కర్మలు, ఆచరణల రీత్యా, మా హృదయాలు వారిని శపిస్తుంటాయో, అలాంటి వాళ్లతో కూడా మేము నవ్వుతూ కలిసి మాట్లాడేవాళ్ళం".

అయితే కొన్ని పరిస్థితుల్లో వివేకాన్ని దృష్టిలో ఉంచుకొని కఠిన వైఖరే అవలంబించడం తప్పనిసరైనప్పుడు వ్యూహం ప్రకారం కఠిన వైఖరి అవలంబించడం కూడా సమంజసమే.

3. ఈ హదీసులోని అబూదావూద్ మరో ఉల్లేఖనంలో హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ను "మీరు స్వయంగా ఆ మనిషి చెడ్డవాడని చెప్పారు. మళ్ళీ మీరే అతన్ని చిరునవ్వుతో కలుసుకొని, ఎంతో మృదువైఖరితో సంభాషించారు. ఇదేమిటి? అని ప్రశ్నించారు.

అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా సెలవిచ్చారు:

"ఆయిషా ! అల్లాహ్ అసభ్యంగా, అమర్యాదగా మాట్లాడేవాణ్ని ప్రేమించడు" అన్నారు. అంటే, అసభ్యంగా మాట్లాడే అలవాటు దైవప్రేమకు, ఆయన ప్రసన్నతకు దూరం చేస్తుంది. మరి నేను అలాంటి చర్యకు ఎలా పాల్పడగలను? అని అర్థం.

★ **మంచిమాట, ఒక తియ్యని పలుకు కూడా 'సద్ఖా' తో సమానమని" దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సెలవిచ్చినట్లు హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారు ఉల్లేఖించారు.**

(బుఖారీ)

సంగ్రహణం:

ఇదొక సుదీర్ఘమైన హదీసులోని చిన్న భాగం. ఒకచోట ఇమాం బుఖారీ రహ్మతుల్లాహి అలైహ్ దీన్ని పూర్తిగా ఉల్లేఖించారు. మరొక చోట సందర్భానుసారం కొద్ది భాగాన్నే ఉటంకించారు. ఒక మనిషితో ఒక మంచి విషయం మధురంగా మాట్లాడితే అతని హృదయం ఆనందంతో పొంగిపోతుంది. ఒక దైవదాసుడి మనసును సంతోషపరచడం నిజంగానే గొప్ప సత్కార్యం.

మీ సంవత్సరపు చందా మా బ్యాంక్ అకౌంట్‌లో జమచేయగలరు...
మా

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

ఫజర్ లో మెలుకువ రావడానికి కొన్ని చిట్కాలు

వనితావని

5 పూట్ల నమాజు ఆచరించి, రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించి, అశ్లీలతకు దూరంగా ఉండి, తన భర్త యొక్క సేవ చేసిన స్త్రీకి రెపు ప్రళయదినాన స్వర్గపు ద్వారాలలో నీకిష్టమొచ్చిన ద్వారము నుండి ప్రవేసించు అని అనబడును.

(ముస్నదే అహ్మద్ 1661)

పైన పేర్కొనబడిన ఈ ఉల్లేఖనంలో స్త్రీలకు ఎంత చక్కటి శుభవార్తను వినిపించడం జరిగింది ! కేవలం 4 కార్యాలు (1) 5 పూట్ల నమాజు, (2) రమజాన్ మాసపు ఉపవాసాలు, (3) పాతివ్రత్యం, (4) భర్త మాట వినడం వీటికి కట్టుబడి ఉన్న స్త్రీ స్వర్గపు ద్వారాలలో తనకు నచ్చిన ద్వారము నుండి స్వర్గములోకి ప్రవేశించేందుకు అర్హత సాధిస్తుంది. అనగా ఎటువంటి ఆటంకము లేకుండా, ఎటువంటి నిబంధనలు లేకుండా డైరెక్ట్‌గా స్వర్గములోకి ప్రవేశిస్తుంది. కొన్ని ఉల్లేఖనాలలో భర్త కన్నా 500 సంవత్సరాలు ముందుగా స్వర్గములోకి ప్రవేశిస్తుందని కూడా ఉంది. ఇది వనితల కొరకు ఎంత గొప్ప వరమో, ఎంత చవక బేరమో !! (అల్లాహు అక్బర్) అయినప్పటికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మరో సందర్భమున మేరాజ్ రాత్రి వారు నరకములో అధిక శాతం స్త్రీలనే చూశారని అన్నారు. ఎందుకు? ఇంత సులువైన కార్యాలను కూడా వారు పూర్తి చేయలేరా?

వాస్తవం ఏమిటంటే స్వర్గపు బాట చాలా సులువైనదే, కాని అక్కడ తిరకాసు ఏమిటంటే ఈ స్వర్గపు బాట నుండి మనల్ని తప్పించడానికి షైతాన్ తన సైన్యంతో కలిసి నిరంతర కృషి చేస్తుంటాడు. ఐహిక వాంఛలు, లౌకిక ప్రయోజనాలు, సిరిసంపదలు చూపించి వంచించేందుకు సాయశక్తులా కృషిచేస్తాడు. కాని ఎవరైతే ధృఢ సంకల్పముతో, చిత్తశుద్ధితో అల్లాహ్‌ను వేడుకొని ముందుకు సాగుతారో వారిని షైతాన్ తన మాయమాటలతో ఏమాత్రం ప్రభావితం చేయలేడు. అనేక సందర్భాలలో నా బంధుమిత్రుల ముందు ప్రసంగిస్తూ పలు సార్లు ఈ హదీసును ప్రస్తావించగా కొంత మంది స్త్రీలు "హదీసులో పేర్కొన్న విషయాలన్నిటిపై వారు ఎంతో సులువుగా అమలు చేస్తున్నామని, ఒక్క ఫజర్ నమాజ్‌కు లేవడం మాత్రమే వారికి సాధ్యపడట్లేదని, దానికోసం ఏమి చేయాలి?" అని ఒకటికి రెండు సార్లు ప్రశ్నించారు. పలు చోట్ల ఈ ప్రశ్నను ఎదురుకున్న తరువాత ఇది ఒకరిద్దరి సమస్య కాదని గ్రహించాను, దీనికి పరిష్కారము ఖుర్‌ఆన్, హదీసు వెలుగులో చూపించాలనుకున్నాను. అల్లాహ్ దయతో దీనికి సంబంధించి సౌదీ అరబ్‌కు మరియు ఇంగ్లాండ్ కు చెందిన ఇద్దరు ప్రముఖ ధార్మిక పండితుల వ్యాసాలు అరబీ, ఇంగ్లీష్ భాషలలో చదివాను. (బహుశ వారిని కూడా ఈ ప్రశ్న వెంటాడి ఉంటుంది). వారిద్దరూ కొన్ని చిట్కాలను వ్రాసి వాటిపై అమలు చేస్తే ఇన్షాల్లాహ్ ఫజర్ నమాజుకు తప్పకుండా మెలుకువ వస్తుందని అన్నారు. వారిద్దరి వ్యాసాల సారాంశాన్ని క్రింద పాఠకులకు

అందిస్తున్నాను. ఇన్‌షాల్లాహ్ వాటిపై అమలు చేయడం ద్వారా మన సమస్య దూరమౌతుందని భావిస్తున్నాను. ఇక్కడ రెండు విషయాలు గుర్తుంచుకోండి, పేర్కొనబడే విషయాలు ఎక్కడనుండో తెచ్చినవి కావు. స్వయంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి జీవితాని అధ్యాయనం చేసి, వారి బోధనలను పరిశీలించి ఈ క్రింది విషయాలను పేర్కొనడం జరిగింది. రెండవ విషయం ఏమిటంటే మీ సౌలభ్యాన్ని చూసి మీరు వీటి నుండి మీకు అనుకూలమైన, మీరు సులువుగా చేయగలిగినన్ని విషయాలపై అమలు చేయండి. ఎక్స్‌ట్రా భారాన్ని మీపై వేసుకొని రెండు మూడు రోజుల్లో అలసిపోకండి. అల్లాహ్ మనకు సంకల్పశుద్ధితో వీటిపై అమలు చేసే భాగ్యాన్ని ప్రసాదించుగాక ! స్వర్గ ప్రాప్తి మాకోసం సులభతరము చేయుగాక ! ఆమీన్...

1. త్వరగా నిద్రపోవడం:

ఇషా నమాజు తర్వాత సాధ్యమైనంతవరకు త్వరగా పండుకోవడం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇషా నమాజు తరువాత మేలుకొని ఉండడాన్ని అఇష్టపడేవారు. (బుఖారీ: 568). మనం అర్ధరాత్రి వరకు జాగారం చేసి ఉదయాన్నే మెలుకువ రావాలి అంటే అది అసంభవం.

2. వజూ చేసుకొని నిద్రించడం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఉపదేశించిన విధంగా వజూ చేసి పండుకోవాలి. ఒక ఉల్లేఖనం ప్రకారం దైవ దూతలు వజూ చేసి నిద్రించే వారితో రాత్రంతా ఉంటారు మరియు అతని మన్నింపు కోసం దేవుడ్ని ప్రార్ధిస్తూ ఉంటారు. (ఇబ్నే హిబ్బాన్: 1064; తబ్రానీ: 13620)

3. కుడివైపుకు తిరిగి పండుకోవాలి:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తెలిపినట్లు కుడివైపుకు తిరిగి, తమ కుడి చేతిన కుడి చంప క్రింద పెట్టి పండుకోవాలి. (బుఖారీ: 6314)

4. దివ్య ఖుర్‌ఆన్ పఠించాలి:

నిద్రించక ముందు దివ్య ఖుర్‌ఆన్ పఠించడం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి అలవాటు. వారు నిద్రించక ముందు వీటిని స్వయంగా పఠించేవారు, ఇతరులకు పఠించమని ఉపదేశించేవారు:

(అ) సూరే సజ్‌దా, సూరే ముల్క్ (తిర్మిజీ: 2892)

(ఆ) సూరే ఇస్‌రా, సూరే జుమర్ (తిర్మిజీ: 2920)

(ఇ) సూరే ఇఖ్‌లాస్, సూరే ఫలఖ్, సూరే అన్ నాస్ (బుఖారీ: 5906) (ఇవి దివ్య ఖుర్‌ఆన్ లోని చివరి మూడు సూరాలు; వీటిని ప్రతి ఒక్కరు సులభంగా చదవగలరు)

(ఈ) ఆయతల్ కుర్సీ (బుఖారీ: 5010) మరియు సూరే బఖర చివరి రెండు ఆయతులు (బుఖారీ: 4723)

అల్లామహ్ ఇబ్నె మార్దువియ్యాహ్ గారి కథనం ప్రకారం "ఏ వ్యకి అయితే సూరే కహఫ్ లోని చివరి 5 ఆయతులు చదివి పండుకుంటాడో అల్లాహ్ అతడ్ని ఎప్పుడు లేవాలను కుంటే అప్పుడు నిద్రలేపుతారు". అల్లామహ్ ఆలూసీ బగ్‌దాదీ రహ్మతుల్లాహి అలైహ్ గారు ఎన్నో సార్లు దీన్ని పరీక్షించానని, నిజంగానే అనుకున్న సమయానికి మెలుకువ వస్తుందని వారు తమ తఫ్‌సీర్‌లో దీన్ని ధృవీకరించారు. (తఫ్‌సీరే ఆలూసీ: 8/190)

5. దుఆ చదవాలి:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు నిద్రించేటప్పుడు చేసే దుఆలను చదివి, ఫజర్ నమాజుకు మెలుకువ వచ్చేలా చేయుమని ప్రార్థించుకొని పండుకోవాలి.

నిద్రించక ముందు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ దుఆలు చేసేవారు:

(అ) అల్లాహుమ్మ బిస్‌మిక అమూతు వ అహ్‌యా (బుఖారీ: 6314)

(ఆ) అల్లాహుమ్మక్కినీ అజాబక్ యౌమ తబ్‌అసు ఇబాదక్ (తిర్మిజీ: 3398)

(ఇ) అల్లాహుమ్మ అస్‌లంతు నఫ్‌సీ ఇలైక, వ

వజ్జహ్‌తు వజ్‌హీ ఇలైక్, వ ఫవ్వజ్‌తు అంరీ ఇలైక్ వ అల్‌జత్‌తు జహ్‌రీ ఇలైక్, రగ్‌బతన్ వ రహ్‌బతన్ ఇలైక్, లా మల్‌జఅ వ లా మన్‌జఅ మిన్‌క ఇల్లా ఇలైక. ఆమన్‌తు బికితాబికల్లజీ అన్‌జల్‌త, వ బి నబియ్యికల్లజీ అర్‌సల్‌త (బుఖారీ: 247)

(ఈ) సుబ్‌హానకల్లాహుమ్మ రబ్బీ బిక వజత్‌తు జంబీ, వ బిక అర్‌ఫఉహూ. ఇన్ అమ్‌సక్‌త నఫ్‌సీ ఫగ్‌ఫిర్‌లహా, వ ఇన్ అర్‌సల్‌తహా ఫహ్‌ఫజ్‌హా బిమా తహ్‌ఫజుబిహీ ఇబాదకస్సాలిహీన్ (ముస్లిం: 2714)

(ఉ) సుబ్‌హానల్లహ్ (33 సార్లు) అల్‌హందులిల్లాహ్ (33 సార్లు) అల్లాహు అక్బర్ (34 సార్లు) (బుఖారీ: 4943)

(పేర్కొనబడ్డ 5 విషయాలలో మెదటి విషయానికి "అంటే త్వరగా నిద్రపోతే ఫజర్ నమాజుకు మెలుకువ రావొచ్చు" మన సమస్యకి సంబంధం ఉంది, కాని మిగతా 4 విషయాలకు దీనికి సంబంధమేమిటి అని మీకు సందేహము కలుగవచ్చు. నిజానికి నిద్రించక ముందు మనం చేసే ఈ పుణ్యకార్యాల వల్ల మనపై అల్లాహ్ అండ ఉంటుంది, రాత్రంతా దైవ దూతల సావాసం మనకు లభిస్తుంది, వారు ఫజర్ నమాజుకు మనల్ని ప్రేరేపిస్తారు. అలా కాకుండా మనం అలాగే నిద్రపోతే మనం షైతాన్ సాంగత్యములో ఉంటాము. అతడు ఉదయాన మనం లేచినా మాయమాటలతో మనల్ని తట్టి నిద్రించేలా చేస్తాడు. అందుకే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు మనకు ఈ విధానాన్ని బోధించారు.

6. దృఢ సంకల్పం:

ఫజర్ నమాజుకు ఎలాగైనా లేవాలనే దృఢ సంకల్పముతో నిద్రపోవాలి.

7. అలారమ్ మరియు ఐడ్డీ

అవసరమైతే ఒకటికి రెండు గడియారాలు, ఫోన్లలో అలారమ్ సెట్ చేసుకోండి. మీ స్నేహితునితో ఎవరు ముందు నిద్ర లేస్తే వారు ఇతరులని నిద్ర లేపాలని ఒప్పందము చేసుకోండి. అల్లాహ్ తఆలా ఇలా సెలవిస్తున్నారు: "దైవభీతి మరియు సదాచారాల విషయంలో ఒకరికొకరు సాయపడండి. పాపకార్యాలలో సహకరించకండి. (ఖుర్ఆన్: 5:2)

8. మధ్యాహ్నం కాసేపు నిద్రపోండి:

అవకాశము ఉంటే మధ్యాహ్నం కాసేపు నిద్రపోవాలి, ఇది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సున్నత్ కూడాను. (బుఖారీ: 905). ఒక దినచర్యను అవలంభించుకొని దాని ప్రకారంగా నిద్రించే వేళలను కూడా నిర్ణయించుకోవాలి. మెల్లమెల్లగా అదే అలవాటుగా మారిపోతుంది.

9. డైలీ రిమైండర్:

ఫజర్ నమాజు చేస్తే కలిగే లాభాలను, చేయనివారికి కలిగే నష్టాలను రోజూ నెమరువేసుకోవాలి. దైవ ప్రవక్త సల్లల్లాహు అళైహి వసల్లమ్ గారు ఈ విధంగా సెలవిచ్చారు: "ఫజర్ మరియు అసర్ నమాజు క్రమము తప్పకుండా చదివేవారు స్వర్గానికి వెళతారు" (బుఖారీ: 574) "ఫజర్ మరియు ఇషా నమాజులు మునాఫిఖ్‌ల (కపటవిశ్వాసుల) పై అతిభారమైన నమాజులు, వాటి విలువేమిటో వారికి తెలిస్తే వారు ప్రాక్కుంటూ వచ్చి చదవాల్సివచ్చినా వారు ఆ నమాజులను వదలరు. (బుఖారీ: 657).

10. నిద్ర ప్రభావాన్ని తొలగించడం:

మెలుకువ రాగానే లేచి కళ్ళు రుద్దుకొని నిద్ర మత్తును దూరం చేసుకోవాలి. ఇంకా టైముంది కదా ! అని షైతాన్ మనసులో గొనుగుతాడు. కాని వాటిని పట్టించుకోకుండా ఈ క్రిమది దుఆలు చదువుతూ బైటికొచ్చేయాలి. లేదంటే మీరు రియలైజ్ అవ్వక ముందే సూర్యుడు ఉదయించేస్తాడు, ఫజర్ వేళ కూడా ముగిసిపోతుంది.

అల్‌హందులిల్లాహిల్లజీ అహ్‌యానా బాదమా అమాతనా వ ఇలైహిన్నుషూర్ (బుఖారీ: 6431)

అల్‌హందులిల్లాహిల్లజీ ఆఫానీ ఫీ జసదీ వ రద్ద అలయ్య రూహీ వ అజినలీ బిజిక్‌రిహ్ (తిర్మిజీ: 3401)

సఫర్
ఇస్లాం దృష్టిలో

ఇస్లామీయ నెలలలో రెండవ నెల "సఫరుల్ ముజఫర్" మొదలౌతోంది. ఈ నెలను గూర్చి ఇస్లాంకు మునుపు నుండే ప్రజల్లో పలు రకాల మూఢనమ్మకాలు ఉండేవి. ప్రజలు ఈ నెలను చాలా అరిష్టమైనదిగా భావించేవారు. ఇందులో ఆకాశాల నుండి శని విరుచుకు పడుతుందని నమ్మేవారు. అందుకనే ఈ నెలలో ఎటువంటి శుభకార్యాలు చేసేవారు కాదు. ఆ అజ్ఞాన కాలంలో వారు అటువంటి మూఢనమ్మకాలు కలిగిఉన్నారంటే అందులో ఆశ్చర్యమేమీ లేదు. కానీ ఇవాల్టి ఈ ఆధునిక యుగములో కూడా, కొందరు ఇటువంటి మూఢనమ్మకాలు కలిగి ఉన్నారంటే అది ఎంతో ఆశ్చర్యకరమైన విషయం. అందులో వారు ముస్లింలు కావడం దుఖించ దగిన విషయం. ఇవాళ కూడా కొందరు ముస్లింలు ఈ నెలను అరిష్టమైనదిగా, శనితో కూడినదిగా భావిస్తారు. వారి ప్రకారం ఈ నెలలో మొదలు పెట్టిన ఏ పనీ పూర్తి కాదు. పెళ్లి చేస్తే ఆ జంట సుఖంగా ఉండదు. వ్యాపారం మొదలు పెడితే అందులో కేవలం నష్టమే చూడాల్సి వస్తుంది..... మొదలగు...

గుర్తుంచుకోండి ! దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఆనాడే ఇటువంటి మూఢ నమ్మకాల్ని కొట్టిపారేశారు. మనకు మంచి జరిగినా, చెడు జరిగినా అది అల్లాహ్ నిర్ణయం ప్రకారమే జరుగుతుందని, అందులో రోజులకు, నెలలకు, ఘడియలకు ఎటువంటి ప్రమేయము లేదని, ఏ కాలాన్నీ, ఏ మాసాన్నీ, ఏ రోజునీ, ఏ వస్తువునీ అరిష్టమైనదిగా భావించరాదని, అపశకునంగా తలచరాదని ముస్లింలకు బోధించారు. దీనికి భిన్నంగా దేన్నైనా అరిష్టమైనదిగా చూడడం ఇస్లాంలో చాలా పెద్ద నేరమని, అది షిర్క్ (అంటే షిర్క్ యొక్క వివిధ రూపాలలో ఒకటి) అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు తెలిపారు.

అబూదావూద్ లోని ఓ ఉల్లేఖనం లో ఇలా ఉంది: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు మూడు సార్లు చాలా తాకీదుగా ఇలా చెప్పారు: "అత్ తియరతు షిర్కున్ అత్ తియరతు షిర్కున్ అత్ తియరతు షిర్కున్" (దేన్నైనా) అపశకునంగా చూడడం షిర్క్ (అల్లాహ్ కు సాటి కల్పించడం) (దేన్నైనా) అరిష్టమైనదిగా భావించడం షిర్క్, (దేన్నైనా) కలిసిరానిదని అనుకోవడం షిర్క్. (అబూదావూద్: 3910)

ముస్నదే అహ్మద్ కు చెందిన ఓ ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఇలా అన్నారు: "దేన్నైనా అపశకునంగా భావించి ఏ వ్యక్తి అయితే తన పనిని నిలిపివేస్తాడో నిశ్చయంగా అతడు షిర్క్ చేశాడు." (ముస్నదే అహ్మద్: 2/220)

ఈ హదీసు ద్వారా అర్థమయ్యేది ఏమిటంటే సఫర్ నెల మొదలైందని (అదే కాదు ఇంకే నేలనైనా

సరే) అది అరిష్టమైనదని, కలిసిరానిదని భావించి ఎవరైనా పెళ్లి లేదా ఇంకేమైనా శుభకార్యాలను వాయిదా వేసుకుంటే అతడు నిశ్చయంగా ఘోరాతి ఘోర పాపమైన షిర్క్ కు పూనుకున్నట్లే.

ధార్మిక విద్వాంసుల మధ్య ఇక్కడ స్వల్ప విభేదము ఏర్పడింది. కొందరు హదీసులో పేర్కొనబడిన షిర్క్ అది షిర్కే అక్బర్ (చాలా ఘోరమైన షిర్క్, అంటే అల్లాహ్ ఉనికిలో, లేదా ఆయన శక్తి సామర్థ్యాలలో ఇతరులను సాటికల్పించడం) అని అంటే, మరికొందరు దాన్ని షిర్కే అస్గర్ (చిన్నపాటి షిర్క్) అని అభిప్రాయ పడ్డారు. షిర్కే అక్బర్ అనడానికి కారణమేమిటంటే అతడు కేవలం అల్లాహ్ కు మాత్రమే కాకుండా వేరే వాటిలోనూ (నెలలు, మాసాలు, వస్తువులలోనూ) లాభనష్టాలు చేకూర్చే శక్తి ఉందని భావించాడు. ఇలా భావించడం నిశ్చయంగా షిర్కే అక్బర్ అవుతుంది. ఏమైనప్పటికీ షిర్క్ అది అస్గర్ అయినా అక్బర్ ఐనా అది ఇస్లాం లో చాలా ఘోరమైన అపరాధం. అల్లాహ్ మనల్ని దీని నుండి కాపాడు గాక. ఆమీన్...

ముస్లిం అనబడే ప్రతి ఒక్కడు తన హృదయ ఫలకముపై ముద్రించుకో వలసిన విషయం ఏమిటంటే అల్లాహ్ తఆలా దివ్య ఖురాన్ లో ఇలా సెలవిస్తున్నారు:

“భూమి మీద గానీ, లేదా స్వయంగా మీ మీద గానీ విరుచుకు పడే ఏ ఆపదైనా సరే ! మేము దాన్ని సంభవింపజేసే ముందే అది (ఎప్పుడో) పుస్తకంలో వ్రాసివేయబడి ఉంటుంది.” (సూరే హదీద్: 57: 22) అంటే మీ కొరకు అల్లాహ్ ఏది రాసిపెట్టాడో అదే సంభవిస్తుంది. రోజులు, ఘడియలు, మాసాలు, వాస్తులు, శకునాలు వీటిలో మీకు లాభనష్టాలు తెచ్చిపెట్టే శక్తి, ప్రభావం ఎంత మాత్రం లేదు. కాబట్టి సఫర్ నెలలో పెళ్లి చేస్తే, మొహర్రం నెల తొలి పదిరోజుల్లో భార్యా భర్తలు కలిస్తే, ముహర్రంలో అత్తారింట్లో ఉంటే, శనివారం పని ప్రారంభిస్తే, పొద్దున్నే ఒకడి ముఖం చూస్తే, పని మీద బయలుదేరేటప్పుడు ఎక్కడికని భార్య అడిగితే, తమ్ముడు అన్న కంటే ఎత్తైన చోట ఇల్లు కట్టుకుంటే, తమ్ముడి ఇంట్లో నీళ్ళు, అన్న ఇంటి మీదగా ప్రవహిస్తే, ఇల్లు వాస్తు ప్రకారం కట్టించకపోతే కీడు జరుగుతుంది అని ఏవైతే ప్రజలలో ఇవాళ మూఢనమ్మకాలు ఉన్నాయో అందులో రవ్వంత వాస్తవం కూడా లేదు. ఒక వేళ వాటిలో కాస్తైనా వాస్తవం ఉండి ఉంటే అమెరికా, రష్యా లాంటి పెద్ద పెద్ద దేశాలు ఇవాళ ప్రగతి పదంలో ఉండేవికావు. వారు వందల అంతస్తులు కడతారు కానీ ఏనాడూ వాస్తును చూడరు, పెళ్లిళ్లు చేస్తారు కానీ ముహూర్తాలు లాంటివి ఏవీ పట్టించుకోరు, దేశ విదేశాల్లో వ్యాపారాలు చేస్తారు కానీ రోజులు, నెలలు, నక్షత్రాలు చూసుకోరు. మరి వారెందుకు మనకంటే మంచి స్థాయిలో ఉన్నారు? ఆలోచించండి !!!

ఇదే వాస్తవాన్ని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు ఈ విధంగా తెలిపారు:

ఓ విశ్వాసుల్లారా ! తెలుసుకోండి: మీకు మంచి చేయాలని ప్రపంచం మొత్తం ఏకమైనా మీకు దేవుడు రాసిపెట్టిన దాని కంటే ఒక్క రవ్వంత ఎక్కువ కూడా మంచిని చేకూర్చలేరు. అలాగే వారంతా మీకు కీడు చేయాలని ఏకమైనా అల్లాహ్ రాసిపెట్టిన దాని కంటే కాస్త ఎక్కువ కూడా హాని కలిగించలేరు.

ఇప్పటి వరకు మీరు అల్లాహ్ మరియు వారి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి మాటలను చూశారు. మరి సఫర్ మాసాన్ని అరిష్టంగా భావించే వారి మాటలను కూడా చూద్దాం.

వారి ప్రకారం సఫర్ నెల అరిష్టమైనది అనడానికి మొదటి సాక్ష్యం:

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు "ఎవరైతే సఫర్ నెల వెళ్లిపోయిందని నాకు శుభవార్త వినిపిస్తారో వారికి నేను స్వర్గపు శువార్తను వినిపిస్తాను" అని అన్నారు. దీన్ని బట్టి అది ఎంత అరిష్టమైన మాసమో, అది ముగిసిపోవాలని ప్రవక్త గారు ఎంత ఆతృతతో ఎదురు చూసేవారో మనకు అర్ధమౌతుంది.

మాషాల్లాహ్ ! చాలా బాగుంది !! కానీ ఈ హదీసు ఏ గ్రంథంలో ఉందటా? బుఖారీ లోనా? ముస్లిం లోనా? ఈ విషయాన్ని ఏ సహాబీ ఉల్లేఖించారట? అబూ హురైరా ర.జి నా? అబూ సయీద్ ఖుద్రీ ర.జి నా? ప్రవక్త గారికి సఫర్ మాసము ముగిసిందని శుభవార్తను వినిపించి స్వర్గం కన్‌ఫార్మ్ చేసుకున్న సహాబా ఎంతమంది ఉన్నారంటా? వారి పేర్లు, వివరాలు ఏంటటా?

ప్రళయ దినం వరకు గడువిచ్చినా వీటికి సమాధానం లభించదు. ఎందుకంటే అసలు అలాంటి హదీసు ఉంటే కదా. ముల్లా అలీ ఖారీ రహ్మతుల్లాహి అలైహ్ గారు "అల్ మౌజూఆతుల్ కుబ్రా" లో ప్రజల నోటిలో తప్ప ఏ గ్రంధములోనూ కనబడని ఈ హదీసు అవాస్తవమని, కేవలం మానవ కల్పితమేనని నిర్ధారించారు. ఇమామ్ షౌకానీ రహ్మతుల్లాహి అలైహ్ "ఫవాయిదుల్ మజ్మూఅహ్" లో ఇమామ్ సన్ఆనీ మరియు అల్లామా ఇరాఖీ (వీరిద్దరూ ప్రముఖ హదీసు పండితులు) ఈ హదీసును "మౌజూ" అనగా కృత్రిమమైనది, స్వయంగా కల్పించుకున్నది అని ఘోషించినట్లు తెలిపారు. మరి ఈ మాటను ఎవరు అల్లారు? దీనివల్ల వారికి ప్రయోజనమేమిటి? వీటికి సమాధానం ఫతావా ఆలమ్‌గీర్ లో మనకు లభిస్తుంది. ఫతావా ఆలమ్‌గీర్ ప్రకారం ఆనాటి జోతిష్కులు సఫర్ మాసము మంచిది కాదని భావించేవారు. వారి మాట నిజమని నమ్మించడానికి వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి పేరును వాడుకొని ఈ అబద్ధాన్ని సృష్టించి ప్రజల్లో వ్యాపింపజేశారు. బహుశా సఫర్ మాసము గురించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు సహీ హదీసుల్లో ఏమి తెలిపారో వారికి తెలియదు. ప్రవక్త గారు చాలా స్పష్టంగా ఇలా అన్నారు: "సఫర్ అరిష్టమైనదన్న భావన, ఉల్లూ (గుడ్లగూబ) వస్తే అపశకునము అన్న భావన అవాస్తవం" (బుఖారీ 5770)

రెండవ ఆధారం: ఈ నెలలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారు అనారోగ్యానికి గురికావడం:

వారి ప్రకారం ఈ నెల మొదటి 13 రోజులు చాలా అరిష్టమైనవి. ఇందులో ప్రవక్త గారు అనారోగ్యానికి గురయ్యారు. ఈ 13 రోజుల్లో ఆకాశం నుండి శని విరుచుకుపడుతుంది, అందుకే వీటిని "తేరా తేజీ" అంటారు. వీటిలో ఊడిపడే శని ప్రభావం నుండి బయటపడాలంటే 13వ తేదీ రాత్రి నిద్రపోయేటప్పుడు తల దగ్గర గుడ్లు, నిమ్మకాయలు పెట్టుకొని నిద్రపోవాలి. అప్పుడు ఆ శని ప్రభావం వాటిలోకి వెళ్లిపోతుంది. ఉదయాన్నే వాటిని పేదవారికి దానం చేసేస్తే సరిపోతుంది.

ఈ మాటలు విన్న వెంటనే ఒక సాధారణ వ్యక్తి నిజమా? చాలా థాంక్స్. బాగా ఉపయోగ పడే విషయాలు చెప్పారు అని అనవచ్చు. కానీ కొంచమైనా ధార్మిక పరిజ్ఞానం ఉన్నవాడు వీటిని వెంటనే తిరస్కరిస్తాడు. ఎందుకంటే ప్రవక్త గారు చనిపోవక ముందు 13 రోజులు అనారోగ్యానికి గురయ్యారు అన్న విషయం వాస్తవమే. కానీ ఆ

13 రోజులు సఫర్ నెల ప్రారంభంలో కాదే !! ప్రవక్త గారు 12 రబీయుల్ అవ్వల్ మధ్యాహ్నం (అంటే వారు పుట్టిన తేదీనే, వారు మదీనా కు వలస వెళ్ళిన తేదీనే) మరణించారు. దానికి ముందు 13 రోజులు, అంటే రబీయుల్ అవ్వల్ మొదటి రెండు వారాలు, సఫర్ నెల చివర్లో ఒక రెండు మూడు రోజులు అనారోగ్యంగా ఉన్నారు. సఫర్ మాసపు మొదటి 13 రోజులకు వారి అనారోగ్యానికి ఎటువంటి సంబంధమే లేదు. ఒక వేళ ఉందే అనుకుందాం. మీరు చెప్పినట్లే వారు ఆ 13 రోజులు అనారోగ్యానికి గురయ్యారనే అనుకుందాం. మరి ఇస్లాం ప్రకారం అనారోగ్యం అనేది శాపం కాదే, అది దేవుని అనుగ్రహం మరియు ఆయన కరుణకు నిదర్శనం అని ఇస్లాం బోధిస్తుంది. ఎవరినైతే అల్లాహ్ అనుగ్రహ దృష్టితో చూస్తాడో, వారిని అనారోగ్యం మరియు ఇతర ఇబ్బందులకు గురిచేస్తాడని, తద్వారా వారి పాపాలను క్షమిస్తాడని, వారి పుణ్యాలను అధికం చేస్తాడని, స్వర్గంలో వారి స్థానాన్ని ఇంకా పెంచుతాడని, అందుకే వ్యాధిని నోటికొచ్చినన్ని మాటలు అనకూడదని స్వయంగా ప్రవక్త గారే బోధించారు. (చూడండి: బుఖారీ: 5645; 5641; 5647; ముస్లిం: 2571; 2572; 2575). మరి అలాంటప్పుడు వారు అనారోగ్యానికి గురైన రోజులు అరిష్టమైనవిగా ఒక ముస్లిం ఎలా భావించగలడు? ఇక గుడ్లూ, నిమ్మకాయల విషయానికొస్తే అది అటు ఖురాన్ లోనూ ఇటు హదీసు లోనూ ఎక్కడా కనిపించదు. అంతే కాదు, అది ఖురాన్ బోధించిన విషయాలకు విరుద్ధమైనదని కళ్ళు మూసుకొని చెప్పొచ్చు. ఎందుకంటే మీరు చెప్పినట్లే ఒకవేళ వాటిలో శని ప్రవేశిస్తే వాటిని పారేయమని ఇస్లాం ఆదేశిస్తుందే గానీ, వాటిని పేదలకు ఇవ్వమని ఆదేశించదు. అల్లాహ్ దివ్య ఖురాన్ లో ఈ విధంగా ఆదేశిస్తున్నాడు: ఓ విశ్వాసులారా! మీరు సంపాదించిన దాని నుండి మరియు మేము మీ కొరకు భూమినుండి ఉత్పత్తి చేసిన వాటినుండి **మేలైన వాటినే** దేవుని మార్గంలో (దానధర్మాల్లో) ఖర్చుపెట్టండి. ఏ వస్తువులనైతే మీరు కండ్లు మూసుకునే గానీ తీసుకోరో. **అలాంటి చెడ్డ వస్తువులను ఇతరులపై ఖర్చు చేయడానికి** ఉద్దేశించకండి. (సూరే బఖరా: 2: 267) మీకు ఫ్రీగా ఇచ్చినా మీరు తీసుకోడానికి ఇష్టపడనటువంటి వస్తువులని పేదలకు మీరు దానం చేసి పుణ్యాన్ని ఆశించకండి అని "మీకు అత్యంత ప్రీతికరమైన దానిని మీరు దేవుని మార్గంలో ఖర్చు పెట్టనంత వరకు మీరు పుణ్యాత్ములు కాలేరు" అని సూరే ఆలే ఇమ్రాన్: 3: 92 లో ఇంత స్పష్టంగా చెప్పాక కూడా ఇటువంటి గుడ్లూ, నిమ్మకాయలు, పాపం పేదవాళ్ళకు దానం చేయమని ఇస్లాం బోధించింది అంటే ఎవడు నమ్ముతాడు.

తలా తోక లేనటువంటి వీరి మాటలకు జవాబులు ఇస్తూ ఈ వ్యాసాన్ని మరింత పొదగించే కన్నా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి ఓ పవిత్ర హదీసుతో దీన్ని ముగించడం మంచిదనిపిస్తోంది. ఎందుకంటే తెలివిగలవాడికి సైగ చాలంటారు, మరి ఇంత క్లుప్తంగా రాసిన తరువాత ఇక సఫర్ గురించి ప్రజల మధ్య ప్రాచుర్యంలో ఉన్న విషయాలు అన్నీ అవాస్తవాలేనని తెలుసుకోవడం ఒక ముస్లింకు కష్టమేమీ కాదని భావిస్తున్నాను. అల్లాహ్ మనందరికీ ఇస్లాం ధర్మాన్ని సరిగ్గా అర్థం చేసుకొని దానిపై ప్రవక్త గారు చూపిన రీతిలో నడిచే భాగ్యాన్ని ప్రసాదించుగాక. ఆమీన్....

ఓ అమూల్యమైన హదీసు: ఒక సారి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారికి వారి ఉమ్మత్ (అనుచర సమాజాన్ని) చూపించి వారిలో 70,000

మందికి మాత్రం ఎటువంటి లెఖ్ఖ చూడకుండానే స్వర్గంలోకి ప్రవేశము కల్పించబడుతుందని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని ప్రవక్త గారు తమ సహాబాకు చెప్పి వారు ఎవరో చెప్పకుండానే (బహుశా ఏదో పనిబడి) ఇంట్లోకి వెళ్ళిపోయారు. వారి అనుచరులు మాత్రం ఆ మహానుభావులు ఎవరు? అని ఒకరినొకరు ప్రశ్నించుకొని ఫలానా వారు అయి ఉంటారని వారే అంచనాలు వేసుకోవడం ఆరంభించారు. ఈ విషయం ప్రవక్త గారికి తెలియగా వారు మళ్ళీ బయటకొచ్చి ఇలా అన్నారు: హుముల్లజీన లా యాస్తరిక్యూన్ (వారు తాయత్తులు వగేరా కోరనివారు) వలా యతతయ్యరూన్ (వేటినీ అరిష్టం, అపశకునం అని భావించనివారు) వలా యక్తవూన్ (వాతలు పెట్టించుకోనివారు) (అంటే ఆ కాలంలో కొన్ని వ్యాధులకి వాతలు పెట్టి చికిత్స చేసేవారు. అలాంటి వాటికి దూరంగా ఉండేవారని అర్థం) వ అలా రబ్బిహిమ్ యతవక్కలూన్ (వారి ప్రభువు పై పూర్తి విశ్వాసం కలవారు). (బుఖారీ: 5705; 6472; ముస్లిం: 375; తిర్మిజీ: 2446)

గౌరవనీయులైన పాఠకులారా !

మీ వద్దకు క్రమం తప్పకుండా పైగామ్ ఎ హిదాయత్ మాసపత్రిక పంపబడుతోంది. 90 శాతం మంది బకాయిలు చెల్లించ వలసియున్నది. కాబట్టి వాటిని చెల్లించవలసిందిగా మనవి చేసుకుం టున్నాము. మీ మెంబర్‌షిప్ వివరాలు కవర్ పై అతికించిన మీ అడ్రస్ పై లైన్‌లో ఉంటాయి. మొదటి లైన్‌లో మీరు ఎప్పటి వరకు డబ్బులు చెల్లించారు, ఆ తరువాత మీ మెంబర్‌షిప్ నెంబర్, ఆ తరువాత మీ పూర్తి అడ్రస్ ఉంటుంది. దయచేసి మీరు గనక బకాయీ చెల్లించాల్సి ఉంటే వెంటనే మా అడ్రస్‌కు మనిఆడర్ లేదా మా బ్యాంక్ అకౌంట్‌లో డిపాజిట్ చేయగలరు. అలాగే ఎం.వో ద్వారా చందా పంపే పాఠకులు తమ ఇంటి నెంబరు, పోస్టాఫీసు పిన్‌కోడ్ నెంబరు తదితర పూర్తి వివరాలు తమ చిరునామాలో తెలియపరచ వలెను. అలాగే మాకు చందా అందిన వెంటనే మీరిచ్చిన చిరునామాకు పత్రికను తప్పక పంపిస్తాము. అనుకోని కారణాల వల్ల మీకు పత్రిక అందనట్లయితే మాకు తప్పక తెలియజేయగలరు.

చిన్నకార్యం - గొప్పప్రతిఫలం

ఒక రోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తమ సతీమణి హజ్రత్ జువేరియా రజియల్లాహు అన్హా గారిని ఫజర్ నమాజు నుండి చాష్త్ (మిట్ట మధ్యానానికి కాస్త ముందు) సమయం వరకు ఒకే చోట కూర్చొని జిక్ర్ (అల్లాహ్ నామ స్మరణం) చేస్తుండడం గమనించి వారికి 4 కలిమాలు (మాటలు) నేర్పి వీటిని మూడు సార్లు చదివితే మీరు ఫజర్ నమాజు నుండి లేవకుండా ఇప్పటివరకు చేసిన జిక్ర్ కన్నా ఎక్కువ పుణ్యం లభిస్తుందని అన్నారు. ఆ 4 కలిమాలు:

1. సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ అదద ఖల్‌కిహీ
2. వ రిజా నఫ్‌సిహీ
3. వ జినత అర్షిహీ
4. వ మిదాద కలిమాతిహీ

(సహీ ముస్లిం: 4/2090; అబూదావూద్: 2/81; తిర్మిజీ: 5/477; ఇబ్నె మాజహ్: 2/1251)

ప్రవక్త(స) వారి ప్రార్థనలు

"దుఆ" అను పదానికి పిలవడం, కేకవేయడం, అర్థించడం అనే అర్థాలు వస్తాయి. అల్లాహ్ తఆలా తమ కరుణకటాక్షాలతో తన భక్తులకు తమ తమ అవసరాలలో అల్లాను అర్థించేందుకు అనుమతించడమే కాకుండా వారిని తమ బాధలను, అవసరాలను తన ముందుంచమని ఆదేశించాడు కూడా. అంతే కాకుండా దేవుడ్ని అర్థించని వారిని "ముతకబ్బిర్" (పొగరుబోతు) అని సంబోధిస్తూ వారిపై తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసాడు.

దివ్య ఖుర్ఆన్ లో ఈ విధంగా ఉపదేశించడం జరిగింది: *"మీరు నన్ను ప్రార్థించండి, నేను మీ ప్రార్థనలను ఆలకిస్తాను. ఎవరైతే నా ప్రార్థన పట్ల దురహంకారం చూపుతారో, వారు తప్పక అవమానితులై నరకంలో ప్రవేశిస్తారు".*

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు 'దుఆ ఆరాధన యొక్క సారము' అని అన్నారు. మరో హదీసులో 'దుఆనే అసలైన ఆరాధన' అని ఉంది. 'అల్లాహ్‌కు అతి ప్రియమైన ఆరాధన దుఆ" అని మరో హదీసు తెలుపుతుంది. ఏ వ్యక్తికైతే దుఆ చేసే భాగ్యం కల్పించ బడిందో అతని కోసం కారుణ్యపు ద్వారాలు తెరువ బడ్డాయి. ఒక హదీసులో 'అల్లాహ్ ను అర్థించని వాడిపై అల్లాహ్ ఆగ్రహం వ్యక్తం చేస్తాడు' అని ఉంది. ఇవే కాకుండా మరెన్నో హదీసులలో దుఆ యొక్క ప్రాముఖ్యతను తెలుపడం జరిగింది. వ్యాసాన్ని కుదించడానికి కొన్ని హదీసులనే ఇక్కడ వ్రాయడం జరిగింది. ఇన్‌షాల్లాహ్ మరో సందర్భములో కేవలం దుఆ ప్రముఖ్యత మరియు దాని విధానము గురించి వివరంగా వ్రాసినప్పుడు మరిన్ని హదీసులను ప్రస్తావిస్తాము.

దుఆ యొక్క ఆదాబ్

దుఆ అనేది అల్లాహ్ తఆలా తరపు నుండి మనకు లభించిన ఓ గొప్ప వరం. దీని ఆదాబ్ కూడా చాలా ప్రాముఖ్యము కలవి. దుఆకు సంబంధించిన ఆదాబ్‌లో నుండి కొన్నిటిని క్రింద పేర్కొనడం జరుగుతుంది.

1. నా దుఆ ఆలకించబడుతుందనే నమ్మకంతో దుఆ చేయాలి.
2. అవసరాలలో, ప్రతికూల పరిస్థితులలో ఏ విధంగానైతే దుఆ చేస్తారో అలాగే అనుకూల పరిస్థితులలోనూ దుఆ చేస్తుండాలి.
3. తొందరపాటు పడకుండా ఓర్పుతో దుఆ చేస్తుండాలి.
4. నేను దుఆ అయితే చేస్తుంటాను కాని నా దుఆ ఆలకించబడదు అని మాత్రం అనకూడదు.
5. అధర్మ సంపదను సేవించడం మానేయాలి.
6. దుఆలో ఎవ్వరినీ శపించకూడదు.
7. ముందు తమ కోసం దుఆ చేసుకోవాలి, ఆ తరువాత ఇతరుల కోసం చేయాలి.

8. దుఆ ఆరంభములోనూ చివరిలోనూ దరూదే షరీఫ్ చదవాలి.
9. అలాగే దుఆలో అల్లాహ్ తఆలాను మహిమ పరచాలి.
10. దుఆ ముగించక ముందు ఒక సారి ఆమీన్ అనాలి.
11. చేతులెత్తి దుఆ చేయాలి, చివర్లో ఆ చేతులను ముఖం పై తడుముకోవాలి.

ఈ వ్యాసంలో హదీసు గ్రంధాల నుండి సేకరించబడిన దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి 55 ప్రత్యేక ప్రార్థనల తెలుగు అనువాదము మీ ముందు ఉంచదలిచాము. ఈ ప్రార్థనలలో ఇహపర లోకాల శ్రేయస్సు మరియు అన్ని రకాల విపత్తుల నుండి రక్షణ కోరడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ దుఆలన్నీ అరబీలో చేసేవారు. కాబట్టి అరబీలోనే మనం కూడా ఈ దుఆలు చేయడం ఉత్తమం. కానీ సాధరణంగా అందరికీ (ప్రత్యేకంగా మహిళలకు) అరబీలో దుఆ చేయడం రాదు. ఒక వేళ చూసి చదివినా వాటి అర్థం తెలియదు. కాబట్టి వారందరి సౌలభ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఈ దుఆల అనువాదాన్ని మీకు అందించ దలచాము.

ముల్లా అలీ ఖారీ రహ్మతుల్లాహి అలైహ్ గారు ఇటువంటి ముఖ్యమైన, ప్రత్యేకమైన దుఆలన్నిటినీ ఒక చిన్న పుస్తకము రూపములో జమ చేసి దానికి "అల్ హిజ్‌బుల్ ఆజమ్" అని పేరు పెట్టారు. వారు, అందులో మన సౌలభ్యం కోసం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి దుఆలన్నిటినీ 7 భాగాలుగా విభజించి రోజుకో భాగాన్ని సులభంగా చదువుకునేలా రూపొం దించారు. అంచేత మీరు ఆ పుస్తకాన్ని సంపాదించుకొని వాటి నుండి దుఆలు నేర్చుకోవడం లేదా చూసి చదవడం ఆరంభించండి. దీని ద్వారా చాలా శుభము, ఇహ పరలోకాల శ్రేయస్సు మరియు అన్ని రకాల విపత్తుల నుండి రక్షణ లభిస్తుంది. కాని దానికి షరతు ఏమిటంటే మనం ధర్మ రీతిలోనే సంపాదించాలి, మనకు అయిన వారితో సరైన సంబంధాలు కలిగి ఉండాలి.

దుఆ ఎలా చేయాలి

దుఆ చేసేటప్పుడు నిష్ఠతో, భయభక్తులతో తమ లేమి మరియు దాసోహాన్ని వ్యక్తం చేస్తూ దుఆ చేయాలి. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు చేసిన ఓ దుఆ ద్వారా మనకు బాగా అర్థమౌతుంది. అది దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు అల్లాహ్ తో చేసిన దువా కూడాను మరియు తమ సంతతికి నేర్పిన పాఠము కూడాను. ఒక వ్యక్తి దుఆ ఎలా చేయాలి, ఎటువంటి పదాలు ఉపయోగించాలి అనే విషయాలు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి ఈ దుఆ నుండి తెలుసుకోవచ్చు.

ఆ దుఆ ఏమిటంటే:

"ఓ అల్లాహ్ ! నీవు నా మాటలు వింటున్నావు, నా పరిస్థితిని చూస్తున్నావు, నీవు నా బాహ్యం, అంతరంగాలను తెలిసినవాడివి, నాకు సంబంధించిన ఏ విషము కూడా నీ నుండి దాగి లేదు. నేను ఆపదలో ఉన్నాను, నీ యొక్క సహాయము అవసరమైన వాడ్ని, నేను నిన్నే అర్థిస్తున్నాను. నీ సహాయము కోరుకుంటున్నాను. భయభ్రాంతులకు గురై ఉన్నాను, నా పాపలను అంగీకరిస్తున్నాను. ఓ అల్లాహ్ ! ఒక గత్యంతరము లేనివాడు అర్థించినట్లు నేను నిన్ను అర్థిస్తున్నాను, ఓ పాపాత్ముడైన, తలవంపు, అవమానానికి గురైనవాడు వేడుకున్నట్లు నేను నిన్ను వేడుకుంటున్నాను. బాధల్లో, సమస్యలలో కూరుకుపోయినవాడు ప్రార్థించినట్లు నేను నిన్ను

ప్రార్థిస్తున్నాను. నీ ముందు నా సిరస్సును వంచి, కళ్ళతో అనువులు కారుసస్తూ, అణకువతో నీపాదలలో వడి నీ నుండి నీ కరుణను కోరుకుంటున్నాను". (కంజుల్ ఉమ్మాల్)

ఈ విధిమైన అణకువ, వినయవినమ్రతలతో చేసే ప్రార్థనలు ఇన్‌షాల్లాహ్ తప్పకుండా ఆలకించబడతాయి.

అల్లాహ్ మనందరికి మనస్ఫూర్తిగా దుఆలు చేసే సౌభాగ్యాన్ని కల్పించాలని ప్రార్థిస్తున్నాను. ఆమీన్...

ప్రవక్త(స) వారి ప్రార్థనలు

1. ఓ అల్లాహ్ ! నా ధార్మిక స్థితిని చక్కదిద్దు. ఎందుకంటే నా యోగక్షేమాలన్నీ దీంతోనే ముడిపడి ఉన్నాయి. నా ప్రాపంచిక స్థితిని సంస్కరించు. ఎందుకంటే నేను ఇక్కడే జీవితం గడపవలసి ఉంది. నా పరలోకాన్ని చక్కదిద్దు, నేను అక్కడికే మరలవలసి ఉంది. నా జీవితాన్ని సమస్త వ్యవహారాలలో మేలుకు, శుభానికి దోహదపడేలా చెయ్యి. ఇంకా నా మరణాన్ని అన్ని రకాల కీడుల నుండి సురక్షితంగా, హాయిగా ఉండే సాధనంగా చేయ్యి. (ముస్లిం)

2. ఓ అల్లాహ్ ! మాకు ఇహలోకములోనూ మేలును ప్రసాదించు, పరలోకంలో కూడా మేలును ప్రసాదించు. మమ్మల్ని నరకాగ్ని నుండి రక్షించు. (బుఖారి, ముస్లిం)

3. ఓ అల్లాహ్ ! నేను నీ నుండి సన్మార్గాన్ని, దైవభీతిని, సౌశీల్యాన్ని, మరియు సాటివారి పట్ల నిరపేక్షాభావాన్ని అర్థిస్తున్నాను. (ముస్లిం)

4. ఓ అల్లాహ్ ! నేను నీ నుండి ఆరోగ్యాన్ని, సౌశీల్యాన్ని, అమానతులను రక్షించే సుగుణాన్ని, సత్ప్రవర్తనను మరియు విధివ్రాతపై రాజీపడే స్వభావాన్ని ప్రసాదించ మని వేడుకుంటున్నాను. (బైహఖీ)

5. ఓ అల్లాహ్ ! నా అంతరంగాన్ని నా బాహ్యము కన్నా ఉత్తమంగా తీర్చిదిద్దు. నా బాహ్యాన్ని కూడా సంస్కరించు. ఓ అల్లాహ్ ! మీరు మీ దాసులకు (మీ దయతో) అనుగ్రహించే సజ్జన కుటుంబీకులు, మంచి (బర్కత్ గల) సంపద, మంచి సంతానము –ఎవరైతే స్వయంగా మార్గవిహీనులు కారు, ఇతరులను కూడా మార్గవిహీనులు చేయరో– నాకు కూడా అనుగ్రహించ మని కోరుకుంటున్నాను. (తిర్మిజీ)

6. ఓ అల్లాహ్ ! నన్ను నీ వరప్రసాదాల ఔన్నత్యాన్ని, ప్రాముఖ్యాన్ని గ్రహించేవానిగా, నిన్ను అత్యధికంగా స్మరించేవానిగా, నీ ఉపదేశాలను పాటించేవానిగా, నీ ఆజ్ఞలను జ్ఞాపకం ఉంచుకునేవానిగా చెయ్యి. (తిర్మిజీ)

7. నా ప్రభువా ! నాకు సహాయపడు, నాకు వ్యతిరేకంగా ఉన్న నా శత్రువుకు సహాయపడకు. నన్ను సమర్థించు. నాకు వ్యతిరేకంగా నిలిచేవారిని సమర్థించకు. నీ సూక్ష్మాతి సూక్ష్మమైన ఉపాయాన్ని నాకు అనుకూలంగా ఉపయోగించు. నాకు వ్యతిరేకంగా ఉపయోగించకు. నన్ను సన్మార్గము పై నడిపించు. సన్మార్గము పై నడవటం నాకు సులభతరం గావించు. నాపై ఎవరు దౌర్జన్యానికి, అత్యాచారానికి ఒడిగట్టినా వారికి వ్యతిరేకంగా నాకు తోడ్పడు. ఓ ప్రభువా ! నీకు కృతజ్ఞతాంజలి ఘటించేవానిగా, నిన్ను అత్యధికంగా స్మరించేవానిగా, నీకు అత్యధికంగా భయపడేవానిగా, నిలువెల్లా నీకు విధేయుడనై ఉండేవానిగా, నీ సన్నిధిలో దీనంగా విలపిస్తూ వంగేవానిగా, మృదు మనస్సుతో నీ కారుణ్య దర్బారు వైపునకు మరలే వానిగా నన్ను తీర్చిదిద్దు. ఓ అల్లాహ్ ! నా పశ్చాత్తాపాన్ని స్వీకరించు, నా పాపాల మాలిన్యాన్ని ప్రక్షలనం గావించు. నా ప్రార్థనను ఆమోదించు. నా విశ్వాసాన్ని పటిష్టపరచు. నా నాలుకను సరిగ్గా నడిచేదిగా

చేయి. నా హృదయానికి సన్మార్గ భాగ్యం ప్రసాదించు. నా అంతరంగం నుండి అన్ని రకాల కాపట్యాన్ని, కుళ్లును, కల్తీని తొలగించు. (తిర్మిజీ)

8. ఓ అల్లాహ్ ! నేను నీ నుండి అన్ని రకాల శుభాలను, మేళ్ళను అర్థిస్తున్నాను. ప్రాపంచిక మేళ్ళను, పరలోకపు మేళ్ళను, నాకు తెలిసిన మేలును, నాకు తెలియని మేలును అర్థిస్తున్నాను. అన్ని రకాల చెడుగుల నుండి నీ శరణు వేడుతున్నాను. ఐహిక కీడునుండి, పరలోకపు కీడు నుండి, నాకు తెలిసిన కీడు నుండి, నాకు తెలియని కీడు నుండి. ఓ అల్లాహ్ ! నీ ప్రత్యేక దాసులు, ప్రియ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఏ ఏ శుభాన్నయితే నిన్ను అర్థించారో వాటన్నిటినీ నేను నీ నుండి అర్థిస్తున్నాను. ఆయన ఏ ఏ కీడు నుండి నీ శరణు వేడారో, నేను కూడా ఓ అల్లాహ్ ! నీ శరణు వేడుతున్నాను. ఓ అల్లాహ్ ! నేను నీ నుండి స్వర్గాన్ని అర్థిస్తున్నాను. నరకం నుండి నీ శరణు వేడుతున్నాను. నరకాగ్నికి దగ్గరగా చేర్చే అన్ని రకాల చేష్టల నుండి, పలుకుల నుండి కూడా నీ శరణు వేడుతున్నాను. ఓ అల్లాహ్ ! నీవు నా యడల ఏ నిర్ణయం గైకొన్నా అది నా పాలిట శ్రేయస్కరంగా పరిణమించేలా చేయమని ప్రాధేయ పడుతున్నాను. (ఇబ్నె మాజహ్)

9. ఓ అల్లాహ్ ! నీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ నిన్ను అర్థించినదంతా మేము అర్థిస్తున్నాము. వేటి నుండి నీ ప్రవక్త నీ శరణు వేడారో వాటన్నిటి నుండి మేము నీ శరణు వేడుతున్నాము. అనుకున్న వాటిని సాధించడం కేవలం నీ దయాదాక్షిణ్యాలపైనే ఆధారభూతమై ఉంది. ఏ ఆశయం కొరకైనా సాధన చేయడం, సాధన చేసే సద్బుద్ధి, శక్తి ప్రాప్తించడం కూడా దైవం తరపుననే జరుగుతుంది. (తిర్మిజీ)

